


సన్నబియ్యంపై బీజేపీ ప్రచారం సిగ్గుచేటు

● కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

కవాడిగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నం బియ్యం పంపిణీ చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బియ్యాన్ని పంపిణీ చేస్తోందని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ సభ్యుడు మందడి అనిల్ కుమార్ యాదవ్ విమర్శించారు. దమ్ముంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం పంపిణీ చేసి చూపించాలని సవాల్ చేశారు. శనివారం కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలోని 851 రేషన్ షాపులో పేదలకు ఆయన సన్నం బియ్యం పంపిణీ చేశారు. అనంతరం కవాడిగూడ డివిజన్‌లోని మారుతీనగర్, మోతీలాల్ నెహ్రూనగర్‌ల్లో 'జై బాపు, జై భీమ్ జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేసి సన్న బియ్యం పంపిణీపై స్థానికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత కాంగ్రెస్ కార్యకర్త మద్దెల ప్రభాకర్ ఇంట్లో సన్నం బియ్యంతో వండిన భోజనాన్ని కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఎంపీ తిన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ ఎన్. అశోక్‌రెడ్డి, ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విడి కృష్ణ, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోత రాజు భాస్కర్, నగర కాంగ్రెస్ నాయకులు పిలక్ష్మణ్, రమేష్‌యాదవ్, సాయిబాబా, మహిళా నేత కవిత తదితరులు పాల్గొన్నారు.



తాళ్లబస్తీలోని రేషన్ షాపులో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఎంపీ మందడి అనిల్‌కుమార్ తదితరులు

దప్పు ఎల్లయ్య బస్తీలో..

చిక్కడపలి : గాంధీనగర్ డివిజన్ దప్పు ఎల్లయ్య బస్తీలోని రేషన్ షాప్‌లో శనివారం సన్నబియ్యం పంపిణీని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్‌బాబు, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కమిటీల నిర్మాణం చేపట్టాలి

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీని సంస్థాగతంగా పటిష్టం చేయడానికి డివిజన్, బూత్ కమిటీల నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా సూచించారు. శనివారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో డివిజన్ కమిటీల ఏర్పాటు కోసం రాష్ట్ర పార్టీ నియమించిన పార్టీ పరిశీలకుల సమావేశం జరిగింది. సమావేశంలో సాయిబాబా మాట్లాడుతూ, గడువులోపు డివిజన్ కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

'బైబిల్ తరగతులతో ఆధ్యాత్మిక చైతన్యం'

చిక్కడపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చైతన్యానికి, దైవచింత పెంచడానికి బైబిల్ తరగతులు ఎంతగానో దోహదపడ్డాయని హెబ్రోన్ చర్చి దైవసేవకుడు జోసెఫ్ పి. కురియన్, చర్చి సొసైటీ చైర్మన్ జాన్ సుందరం, దైవసేవకుడు ఇమ్మాన్యుయేల్ అన్నారు. గోల్కొండచౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో 12 రోజులపాటు నిర్వహించిన బైబిల్ తరగతులు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా జోసెఫ్ కురియన్, జాన్ సుందరం మాట్లాడుతూ, జంట నగరాల్లో కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలో బైబిల్ తరగతుల్లో పాల్గొన్నారని అన్నారు.

'కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలి'



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

బర్కత్‌పుర, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో మూడు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరుశురాం, సంయుక్త కార్యదర్శి డాక్టర్ తిరుపతి, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు డాక్టర్ శైలజా రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బర్కత్‌పురలోని ఆయన నివాసంలో కలిసి కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించేందుకు సహకరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం: బీజేపీ

కవాడిగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకోడం చరిత్రాత్మక నిర్ణయమని బీజేపీ సికింద్రాబాద్ జిల్లా మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చిత్రకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, ఓబీసీ మోర్చానగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

ముషీరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కులగణన చేపట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు ముషీరాబాద్ డివిజన్ భరత్ నగర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు జమాల్‌పురి నందు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా అనురాధాగౌడ్



నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

చిక్కడపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షురాలిగా గడ్డమీది అనురాధాగౌడ్ నియమితులయ్యారు. శనివారం ఆమెకు సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య నియామకపత్రం అందజేసి అభినందించారు. అనురాధాగౌడ్ తెలంగాణ గౌడ సంఘం మహిళా అధ్యక్షురాలిగా 30 ఏళ్లుగా కొనసాగుతున్నారు. 40 సంవత్సరాలుగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో క్రియాశీలక కార్యకర్తగా రాణిస్తున్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు, గౌడ మహిళలు, బీసీ మహిళల అభివృద్ధి కోసం ఆమె శ్రమిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆర్ కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



'ప్రజా ఆసుపత్రి'కి ఇచ్చిన అనుమతులపై పునరాలోచిస్తాం

● జిల్లా డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ జయశ్రీ

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని డాక్టర్ శంకరణ్ ప్రజా ఆసుపత్రికి వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చిన తాత్కాలిక ఇచ్చిన అనుమతులపై పునరాలోచన చేస్తామని హైదరాబాద్ జిల్లా డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ జయశ్రీ తెలిపారు. ఆ ఆసుపత్రికిచ్చిన అనుమతిని రద్దు చేయాలని ఆర్టీసీ క్రాస్‌రోడ్ లోపి పట్టాభి టవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజయ భాస్కర్, గుణశేఖర్, జగన్‌మోహన్‌రెడ్డి, సంధ్య 35 ఎంఎం యజమానులు రమేష్, మాధవి హైదరాబాద్ జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా వైద్యాధికారి ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని శనివారం డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ జయశ్రీ, అశ్రితారెడ్డి, గణేష్‌లను పంపించారు. వారు ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి అందులో ఆసుపత్రి పెట్టడానికి కావాల్సిన మౌలిక వసతులు ఉన్నాయా లేదా అనేది పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిపై ఫిర్యాదు చేసిన వారిని కలిసి వారి అభిప్రాయాలు సేకరించారు. తాము పరిశీలించిన అంశాలతో నివేదిక తయారు చేసి జిల్లా వైద్యాధికారికి అందిస్తామని డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాంనగర్. మే 3 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన పలు అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఆర్టీసీ క్రాస్‌రోడ్‌కు ఇరువైపులా నిర్మించిన పలు షాపులను టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, టీపీఓ కిష్టయ్యల ఆధ్వర్యంలో చిక్కడపల్లి సీఐ రాజు నాయక్ ఏర్పాటు చేసిన బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఈ సందర్భంగా షాపు యమానులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు మధ్య వాగ్వాదం తోపులాట జరిగాయి. పోలీసులు షాపు యజమానులను పక్కకు తీసుకెళ్లగా టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చి వేతలు కొనసాగించారు. ఏసీపీ దేవేందర్ మాట్లాడుతూ, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది అనిల్, శ్రీధర్, రాజయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.



'కులగణనకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి'

రాంనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): జనగణనలో బీసీ కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు మద్దతు ఇచ్చి సర్వేలో పాల్గొనాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ కోరారు. శనివారం వి ద్యానగర్‌లోని బీసీ భవన్‌లో 12 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నీల వెంకటేష్ మాట్లాడుతూ, కులగణన చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని 12 బీసీ సంఘాలు స్వాగతిస్తున్నాయన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు అనంతయ్య, జిల్లపల్లి అంజి, సి రాజేందర్, మోది రాందేవ్, మణికంఠ, రాజునేత, మదుసుదన్, నర్సింగ్‌గౌడ్, నిరంజన్, వెంకన్న , హుస్సేన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

బస్తీకి దూరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆందోళన

కవాడిగూడ , మే 3 (ఆంధ్రజ్యోతి) : కవాడిగూడ డివిజన్ గగన్‌మహల్‌లో ఏవీ కాలేజీ యాజమాన్యం నిర్మించ తలపెట్టిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ హైటెన్షన్ వైర్ల స్తంభాలను బస్తీ గోడకు పది అడుగుల దూరంలో ఏర్పాటు చేయాలని స్థానికులు, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఆందోళన నిర్వహించారు. బస్తీ గోడకు ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ హైటెన్షన్ పోల్స్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో స్థానికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. కాలేజీ యాజమాన్యం, విద్యుత్ అధికారులు స్పందించి స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, విఠల్‌రావు. దిలీప్‌యాదవ్, ప్రభాకర్, కుమార్‌గౌడ్, బస్తీవాసులు రమేష్, ఎల్లయ్య . నవీన్, సంతోష్, శ్రీరామ్ పాల్గొన్నారు.

గాంధీనగర్ సీఐగా బోస్ కిరణ్

కవాడిగూడ, మే 3 (ఆంధ్రజ్యోతి):గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బోస్ కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా ఉన్న డి. రాజు ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు డీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పంజాగుట్ట ట్రాఫిక్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బోస్ కిరణ్ బదిలీపై వచ్చారు.









